క్లుప్తంగా

వరసిద్ధి వినాయకునికి ప్రత్యేక పూజలు



మనుబోలు : మనుబోలు బీసీ కాలనీ సమీపంలో వెలసిన వరసిద్ధి వినాయకునికి బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకుడు శ్రీనివాసులు స్వామివారికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించి ప్రత్యేకాలంకరణ చేశారు. అనంతరం సహస్రనామార్చన, స్వస్తి పుణ్యవచనం, మహాగణపతి హోమం తదితర పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా జరిపించి భక్తులకు తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. ఉభయకర్తలుగా యారాసి వెంకటేశ్వర్లు, హరికృష్ణ, నవీన్ వ్యవహరించారు.

9న అయ్యప్పస్వామి అంబళ్లపూజ

పొదలకూరు : స్థానిక అయ్యప్పస్వామి(శివాలయం ప్రాంగణం) దేవస్థానంలో ఈనెల 9వ తేదీ శనివారం రాత్రి 7 గంటలకు స్వామివారికి 47వ అంబళ్ల పూజ జరుగుతుందని అయ్యప్ప సేవా సమితి వారు బుధవారం తెలిపారు. పూజా కార్యక్రమం తర్వాత తీర్థప్రసాద వితరణ ఉంటుందన్నారు. 10వ తేదీ ఆదివారం ఉదయం 10.30 గంటలకు అయ్యప్పస్వామి శాస్త్రపూజ, మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం గ్రామోత్సవం నిర్వహిస్తామని పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాల్సిందిగా కోరారు.

అటెండర్‌కు కౌన్సెలింగ్

పొదలకూరు : విధి నిర్వహణలో మద్యం తాగి గొడవ చేస్తున్న సీహెచ్‌సీ అటెండర్ సుహేత్‌బాబుకు ఎస్సై ఎస్‌కే హనీఫ్ కౌన్సెలింగ్ ఇచ్చి పంపారు. మూడు నెలల క్రితం ఆత్మకూరు నుంచి స్థానిక సీహెచ్‌సీకి బదిలీపై వచ్చిన ఆయన విధులకు సక్రమంగా హాజరయ్యే వాడు కాదు. ఒకవేళ విధులకు హాజరైనా మద్యం సేవించి ఇష్టానుసారం ప్రవర్తించేవాడు. బుధవారం ఆస్పత్రి స్టాఫ్ నర్సును ఇబ్బంది పెడుతుండడంతో ఆమె పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఎస్సై అటెండర్‌ను స్టేషన్‌కు తీసుకొచ్చి కౌన్సెలింగ్ ఇచ్చారు. మరో పర్యాయం ఇలా ప్రవర్తిస్తే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు.

ప్రసన్న పరామర్శ



రాజశేఖర్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రసన్నకుమార్‌రెడ్డి

కోవూరు : రాపూరు మండలం, వేసినాపి గ్రామంలో రాపూరు మాజీ సమితి అధ్యక్షుడు పాపకన్ను రాజశేఖర్‌రెడ్డి ఉత్తరక్రియలు కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి బుధవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా రాజశేఖర్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. అలాగే మండలంలోని గంగవరంలో వైఎస్సార్‌సీపీ నేత వేమిరెడ్డి రవీంద్రరెడ్డి తండ్రి వేమిరెడ్డి రమణారెడ్డి ఇటీవల మృతిచెందారు. ఆయన ఉత్తరక్రియలకు ప్రసన్న హాజరై నివాళులర్పించారు. ఆయన వెంట డీసీఎమ్మెస్ మాజీ చైర్మన్ వీరి చలపతిరావు, జొన్నవాడ దేవస్థానం చైర్మన్ మావులూరు శ్రీనివాసులు రెడ్డి, పార్టీ నేతలు అనూప్‌రెడ్డి, మోషే, వెంకమ్మ తదితరులు ఉన్నారు.

పీహెచ్‌సీ తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

ఇందుకూరుపేట : మండలంలోని జగదేవిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని వైద్యారోగ్యశాఖ జిల్లా నోడల్ అధికారి పీఎల్ దయాకర్ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రసవాలు వైద్యశాలల్లోనే జరగాలని చెప్పారు. ఓపీ మరింత మెరుగుపడేలా వైద్యసేవలు అందించాలని కోరారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. వైద్యాధికారి డాక్టర్ కిశోర్, హెల్త్ ఎడ్యుకేటర్ సుధాకర్ పాల్గొన్నారు.

బీరువా వితరణ



బుచ్చిరెడ్డిపాళెం : పట్టణంలోని పాత కాశీపాళెం విశ్రాంత టీచర్ బొజ్జా వెంకటరమణయ్య మండల విద్యాశాఖ కార్యాలయానికి బుధవారం బీరువాను అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓలు ఎం.దిలీప్‌కుమార్, పీవీ రత్నంలు దాతను సత్కరించి అభినందనలు తెలిపారు.

డబుల్ రోడ్డుకు మోక్షమెన్నడో..?

- తోటపల్లిగూడూరు-సీఎస్‌పురం రహదారిపై నిర్లక్ష్యం
- దశాబ్దాలుగా ఇక్కట్ల నడుమ ప్రయాణం



తోటపల్లిగూడూరు-సీఎస్‌పురం మధ్య ఉన్న సింగిల్ రోడ్డు

తోటపల్లిగూడూరు : తోటపల్లిగూడూరు- సీఎస్‌పురం(చంద్రశేఖరపురం) ఆర్‌అండ్‌బీ రహదారి 7.5 కిలోమీటర్ల పొడవునా ఉంది. తోటపల్లిగూడూరు మొదలకొని సీఎస్‌పురం వరకు సుమారు 11 గ్రామాలకు వాహన రాకపోకలు సాగుతుంటాయి. జిల్లాలోనే ప్రముఖ పుణ్యక్షేత్రంగా విలసిల్లుతున్న కాటేపల్లి శివాలయం, కాటేపల్లి బీచ్‌లకు ఈ మార్గం ద్వారానే రాకపోకలు సాగించాల్సి ఉంది. ఎంతో ప్రాధాన్యతను సంతరించుకున్న రహదారి సింగిల్ రోడ్డుగా ఉండడంతో దశాబ్దాలుగా వాహనదారులు, ప్రజలు అనేక ఇబ్బందుల నడుమ ప్రయాణం సాగించాల్సి వస్తోంది. ఇరుకైన సింగిల్ రోడ్డులో ప్రతి అర కిలోమీటర్‌కు రోడ్డు పొడవునా ఉన్న మలుపులు ప్రమాదాలకు నిలయాలుగా మారుతున్నాయి. అంతేకాక ప్రధాన రహదారిలో పలు కాలం చెల్లిన ఇరుకైన వంతెనలు(కల్వర్టులు) కూడా రోడ్డు ప్రమాదాలకు కేంద్ర బిందువులుగా మారిపోయాయి. ప్రమాదకర మలుపులు, ఇరుకైన వంతెనలతో ఇరుకైన సింగల్ రోడ్డుపై ప్రయాణం వాహనదారులకు ఓ చాలెంజ్‌గా మారుతోంది. ప్రమాదాలకు నిలయంగా మారిన ఈ మార్గాన్ని డబుల్ రోడ్డుగా మార్చాలని స్థానికులు గత ఇరవై ఏళ్లుగా మొరపెట్టుకొంటున్నా పాలకులు పట్టించుకున్న పాపాన పోవడం లేదు.

డబుల్‌రోడ్డు మంజూరైనా మొదలుకాని పనులు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్(ఎన్‌డీబీ) రుణ సదుపాయంతో తోటపల్లిగూడూరు-సీఎస్‌పురం రహదారిని డబుల్ రోడ్డుగా విస్తరింపజేసేందుకు రూ.17.12 కోట్లను కేటాయించింది. అయితే రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలను తొలగించే విషయంలో అధికారుల నిర్లక్ష్యం కారణంగా అప్పట్లో పనులు మొదలు కాలేదు. అప్పటి నుంచి ఇప్పటి వరకు తోటపల్లిగూడూరు-సీఎస్‌పురం డబుల్ రోడ్డు పనులకు సంబంధించి నిధుల విడుదల ప్రతిపాదనలకు కూడా రాలేదు.



ఎదురొచ్చే వాహనాలు తెలియకుండా ప్రమాదకరంగా ఉన్న మలుపు రోడ్డు



ప్రమాదకరంగా మారిన వంతెన

ఇబ్బందులు పడుతున్నాం



సీఎస్‌పురం నుంచి మండల కేంద్రం తోటపల్లి గూడూరుకు ప్రయాణం అంటే నరకమే. పదేపదే వచ్చే మలుపులతో సింగిల్ రోడ్డు ప్రమాదాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిపోయింది. ఈ సింగిల్ రోడ్డుపై ఎదురుగా నాలుగు చక్రల వాహనం ఎదురొచ్చిందంటే పక్కన గోతిలోకి దిగాల్సిందే. వర్షాల సమయంలో రోడ్డు పక్కన గోతుల్లో లోతు తెలియక ఎందరో వాహనదారులు ప్రమాదాలకు గురై క్షతగాత్రులుగా మారుతున్నారు.

– ఎండికళ్ల దయాకర్‌గౌడ్, సీఎస్‌పురం

నిధులను మంజూరు చేయాలి



మండలంలో ప్రమాదకరంగా మారిన తోటపల్లి గూడూరు–సీఎస్ పురం సింగిల్ రోడ్డును డబుల్ రోడ్డుగా మార్చాలని గత ఇరవై ఏళ్లుగా పాలకులకు విన్నవిస్తూ వస్తున్నాం. గత ప్రభుత్వంలో నిధులు మంజూరైనా అధికారుల నిర్లక్ష్యం కారణంగా పనులు మొదలు కాలేదు. ఇప్పటికైనా పాలకులు తోటపల్లిగూడూరు–సీఎస్‌పురం డబుల్ రోడ్డు నిర్మాణానికి వెంటనే నిధులు మంజూరు చేయాలి.

– మన్నెం చిరంజీవులగౌడ్, మాజీ జెడ్పీ సభ్యులు, తోటపల్లిగూడూరు

300 మంది స్వచ్ఛంద రక్తదానం



రక్తదాతలకు ప్రశంసా పత్రాలు

కొడవలూరు : మండలంలోని నార్తురాజుపాళెంలో ఉన్న శ్రీవెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో రెడ్‌క్రాస్ సొసైటీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సహకారంతో బుధవారం మెగా రక్తదానం శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 300 మంది విద్యార్థులు, అధ్యాపకులు స్వచ్ఛంద రక్తదానం చేశారు. కళాశాల చైర్మన్ డాక్టర్ పి.గుణశేఖర్ రక్తదాతలకు ప్రశంసా పత్రాలు అందజేసి మాట్లాడారు. రక్తదానం ప్రాణదానంతో సమానమన్నారు. విద్యార్థులు ఇలాంటి సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సి.ప్రకాష్‌రావు, ఎన్ఎస్ఎస్ పీఓ పి.రవికుమార్, రెడ్‌క్రాస్ ఎంఓ ఎస్.వరప్రసాద్, హెచ్‌డీఎఫ్‌సీ నెల్లూరు సిటీ హెడ్ ఎం.వీరభద్రరావు పాల్గొన్నారు.

యార్డులో రైతు శిక్షణా శిబిరం నేడు

పొదలకూరు : స్థానిక నిమ్మమార్కెట్ యార్డులో ఉద్యాన పంటలపై రైతు శిక్షణా శిబిరాన్ని గురువారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తామని ఉద్యానాధికారి ఈ.ఆనంద్ బుధవారం తెలిపారు. ఈ శిబిరానికి కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసులురెడ్డి హాజరై చీడపీడలపై రైతులకు అవగాహన కల్పిస్తారన్నారు. అనంతరం ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పాల్గొని రైతులకు వ్యవసాయ పరికరాలను అందజేస్తారన్నారు. అధిక సంఖ్యలో రైతులు హాజరు కావాల్సిందిగా కోరారు.

అక్రమ అరెస్టులతో పోరాటాలను ఆపలేరు

- పేదల గుడిసెలు కూలదోయడం అన్యాయం
- వ్యవసాయ కార్మిక సంఘం నేతల నిరసన

తోటపల్లిగూడూరు : అక్రమ అరెస్టులతో సీపీఎం చేస్తున్న పోరాటాలను ఆపలేరని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు జొన్నలగడ్డ వెంకమరాజు, మంగళం పుల్లయ్య అన్నారు. మండలంలోని పాపిరెడ్డిపాళెం భూముల్లో గుడిసెలు నిర్మించుకున్న పేదలకు అండగా నిలిచిన పలువురు సీపీఎం నేతలను స్థానిక పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. ఈ క్రమంలో జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం నేతలు స్థానిక పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని కార్యకర్తలతో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని పాపిరెడ్డిపాళెం సర్వే నంబర్–497లోని 10.08 ఎకరాల ఇనామ్ భూమి గత పదిహేను ఏళ్లుగా స్థానిక గ్రామాలకు చెందిన పేదల స్వాధీనంలో ఉందన్నారు. అయితే ఆ భూమిని పేదలకు దక్కకుండా అధికార పార్టీ నేతలు పన్నాగం పన్నుతున్నారన్నారు. కొందరు దొంగ పట్టాలు సృష్టించుకుని అధికార పార్టీ నేతలకు కొమ్ముకాస్తూ పేదల కడుపు కొట్టడం ఎంత వరకు సమంజసమన్నారు.



పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం జిల్లా నేతలు

అర్హులకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తే తామే స్వచ్ఛందంగా గుడిసెలు తీసేస్తామని ఎంత చెప్పినా వినకుండా జేసీబీలతో 350 పూరి గుడిసెలను కూలదోయడం అన్యాయమన్నారు. దీనిని ప్రశ్నించిన స్థానిక సీపీఎం నాయకులను ఈడ్చుకెళ్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించడం అమానుషమన్నారు. అక్రమ అరెస్టులతో సీపీఎం చేస్తున్న ఉద్యమాలను అడ్డుకోలేరని, అధికార పార్టీ నేతలు గుర్తుంచుకోవాలన్నారు. పాపిరెడ్డిపాళెం భూముల్లో పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించే వరకు పోరాటం ఆగదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మహిళా నాయకురాలు కాల్తిరెడ్డి రమణమ్మ, పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల దాతృత్వం



కొడవలూరు : మండలంలోని రామన్నపాళెం పాతూరు ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు స్థానిక నేత డేగా దయాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో పాఠశాల పూర్వ విద్యార్థులు ప్లేటో షూ కంపెనీ అధినేతలు కరేటి పవన్‌కుమార్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి బుధవారం షూస్‌లను పంపిణీ చేశారు. స్థానిక నేతలు కొండారెడ్డి శంకర్‌రెడ్డి, శశికాంత్‌రెడ్డి, హెచ్ఎం గౌస్‌బాషా, ఉపాధ్యాయులు శ్రీలక్ష్మి, ఫిరోజ్, సుజాత, కిరణ్మయి, సుధాకర్, గ్రామస్తులు గణేష్, వంశీ పాల్గొన్నారు.

'సూర్యఘర్'పై అవగాహన

తోటపల్లిగూడూరు : ప్రధాన మంత్రి సూర్యఘర్ యోజన పథకంపై ట్రాన్స్‌కో అధికారులు మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాన్స్‌కో ఎస్ఈ విజయన్ మాట్లాడుతూ సూర్యఘర్ పథకం కింద ప్రతి ఇంట్లో సోలార్ యూనిట్‌ను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈఈ సోమశేఖర్, డీఈఈ రాము, ఏఈ ప్రతాప్ పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో రక్తహీనతకు చెక్

మనుబోలు : మంచి పోషక విలువలున్న ఆహారం తీసుకోవడం ద్వారా బాలింతలు, గర్భిణుల్లో వచ్చే రక్తహీనతను నివారించవచ్చని ఐసీడీఎస్ సీడీపీఓ విజయలక్ష్మి అన్నారు. మండలంలోని కాగితాలపూరు, ఎల్ఏన్‌పురం అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం పౌష్టికాహార ఆవశ్యకత, పరిసరాల పరిశుభ్రతపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు హెచ్‌బీ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. రోజువారీ ఆహారంలో గుడ్లు, పాలు, ఆకుకూరలు, తాజా కూరగాయలు, పండ్లు ఉండేలా చూసుకోవాలన్నారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని సూచించారు. సూపర్‌వైజర్ రమణమ్మ, ఏఎస్ఎం జయరామమ్మ, అంగన్‌వాడీలు రేవతి, విజయమ్మ పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ

గ్రామసభలను సద్వినియోగం చేసుకోండి

మనుబోలు : రీసర్వే సందర్భంగా చోటుచేసుకున్న లోపాలను సరి చేసేందుకు నిర్వహిస్తున్న గ్రామసభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ మంజుల అన్నారు. మండలంలోని పర్లపాడు గ్రామంలో బుధవారం రీసర్వే గ్రామసభ నిర్వహించి రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఇప్పటికే రీసర్వే పూర్తయిన గ్రామాల్లో భూ సమస్యలపై ఆయా గ్రామస్తులు తహసీల్దార్ కార్యాలయానికి రాకుండా ప్రభుత్వం గ్రామసభలు నిర్వహిస్తోందని తెలిపారు. ఆర్ఐ నారాయణ, సర్వేయర్ శివకుమార్ పాల్గొన్నారు.

సమస్యలను తప్పక పరిష్కరిస్తాం

కొడవలూరు : రీసర్వేలో తలెత్తిన సమస్యలను తప్పక పరిష్కరిస్తామని తహసీల్దార్ కె.స్ఫూర్తి హామీ ఇచ్చారు. మండలంలోని గండవరంలో రీసర్వే సమస్యలపై బుధవారం గ్రామసభ నిర్వహించి రైతుల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రీసర్వేలో స్వల్ప లోపాలు మాత్రమే చోటుచేసుకున్నాయని, వాటిని 15 రోజుల్లోనే పరిష్కరిస్తామన్నారు. డీటీ అరుణ్‌కుమార్, సర్వేయర్ శ్రీలత, వీఆర్వోలు మస్తాన్, షరీఫ్, సర్పంచ్ రాజకుమారి పాల్గొన్నారు.

రొయ్యలపాళెం రైతులను ఆదుకోవాలి

ముత్తుకూరు : మండలంలోని రొయ్యలపాళెం దళిత రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు తహసీల్దార్ బాలకృష్ణారెడ్డికి ఆయన కార్యాలయంలో బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి గడ్డం అంకయ్య, సీనియర్ నాయకుడు నక్కా రాధయ్య, మండల సభ్యులు షేక్ మస్తాన్ షా, ఏడుకొండలు తదితరులు మాట్లాడారు. సాగరమాల నిర్మాణం కోసం దళితుల భూములను ధ్వంసం చేశారని తెలిపారు. వ్యవసాయానికి పనికిరాకుండా చేశారని వివరించారు. సేకరించిన భూములకు త్వరగా నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

యార్డు వ్యాపారులకు నోటీసులు

పొదలకూరు : స్థానిక ప్రభుత్వ నిమ్మమార్కెట్ యార్డులో దుకాణాలు తీసుకున్న వ్యాపారులకు మార్కెటింగ్ అధికారులు బుధవారం నోటీసులు జారీ చేశారు. వీటిని ఇన్‌చార్జి సెక్రటరీ రఘు దుకాణాలకు అంటించారు. ఇక్కడి దుకాణాలను వేలంలో దక్కించుకున్న వారు వ్యాపారాలు చేయకుండా అద్దెల ఇస్తున్నారని మార్కెటింగ్ శాఖ అధికారులకు ఫిర్యాదులు అందాయి. దీంతో జూన్‌లో గుంటూరు మార్కెటింగ్‌శాఖ విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఇందులో 12 దుకాణాలకు సంబంధించి సజావుగా వ్యాపారాలు చేయడం లేదని, అద్దెకు ఇచ్చారని పేర్కొంటూ నోటీసులు అందజేశారు. మూడు రోజుల్లో దుకాణాలను ఖాళీ చేసి తమకు అప్పగించాల్సిందిగా నోటీసుల్లో పేర్కొన్నారు. కాగా గతేడాది యార్డులో 24 దుకాణాలకు సంబంధించి బహిరంగ వేలం నిర్వహించారు. వాటిలో పది మంది అగ్రిమెంట్లు చేయించుకోకుండా వదిలేశారు. మిగిలిన 14 దుకాణాలను వ్యాపారులు అగ్రిమెంట్ చేసుకున్నారు. అయితే దుకాణాలను అద్దెకు తీసుకున్న వారు వ్యాపారాలు చేయడం లేదని టీడీపీ నాయకులు మార్కెటింగ్ జేడీకి ఫిర్యాదు చేశారు. దీంతో 14 దుకాణాల్లో ఇద్దరే వ్యాపారాలు చేస్తున్నారని, మిగిలిన వారు ఖాళీ చేయాల్సిందిగా అధికారులు నోటీసులు అంటించారు.

ప్రసన్నకు అభినందన



ప్రసన్నకు మొక్క అందజేస్తున్న పల్లిపాడు నాయకులు



ప్రసన్నతో శ్రీనివాసులురెడ్డి, జయలక్ష్మి

ఇందుకూరుపేట : వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమితులైన మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని బుధవారం పలువురు నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. నెల్లూరులోని ఆయన నివాసంలో వారు కలిసి పూలమొక్క అందజేశారు. జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ శ్రీహరికోట జయలక్ష్మి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మావులూరు శ్రీనివాసులురెడ్డి, నాయకులు షబ్బీర్, శ్రీహరికోట ప్రసాద్, గూడూరు జయరామయ్య, లేబూరు సుమంత్ రెడ్డి, దువ్వూరు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడులు

- జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి

తోటపల్లిగూడూరు : వరిసాగులో రసాయన ఎరువుల మోతాదును తగ్గించి సేంద్రియ ఎరువులను వినియోగిస్తే అధిక దిగుబడులను సాధించవచ్చని జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి సూచించారు. మండలంలోని కోడూరు బిట్–1, బిట్–2 గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యవాణి మాట్లాడుతూ రసాయన ఎరువులతో భూసారం నశించి పంట దిగుబడులు తగ్గే అవకాశం ఉందన్నారు. నీటి యాజమాన్య పద్ధతులు, ఎరువుల యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించే అవకాశం ఉందన్నారు. రబీ సాగు చేపటనున్న రైతులు డిసెంబర్–31లోగా హెక్టారుకు రూ.420 ప్రీమియంను బ్యాంకుల్లో చెల్లించి పీఎం ఫసల్ బీమా యోజన పథకం కింద నమోదు చేసుకోవాలన్నారు. అనంతరం క్షేత్ర సందర్శన చేపట్టి రైతులకు సూచనలు చేశారు. కృషి విజ్ఞాన కేంద్రం ఏడీఏ నర్సోజిరావు, మండల ఏఓ శిరీషారాణి, వీఏఏలు దయానా, శశి, మత్స్యశాఖ వీఎఫ్ఏ సుప్రియ, ఇతర వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.



తోటపల్లిగూడూరు : కోడూరులో పంట పొలాల్ని సందర్శిస్తున్న వ్యవసాయాధికారులు

ఎరువులకు నమోదు చేసుకోవాలి

పొదలకూరు : రబీలో ఎరువుల కావల్సిన రైతులు దగ్గరలోని రైతుసేవా కేంద్రంలో పేర్లు నమోదు చేసుకోవాల్సిందిగా ఏఓ ఎ.వాసు సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని విరువూరు, సూరాయపాళెం గ్రామాల్లో ఏఓ రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులను ఆర్ఎస్‌కేల ద్వారా అందజేస్తున్నట్లు తెలిపారు. రైతులకు వరి విత్తనాలను రాయితీపై పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. వరిలో వచ్చే చీడపీడలపై ఏఆర్ఎస్ శాస్త్రవేత్త హసీనా అవగాహన కల్పించారు. ఏఈఓ ఏడుకొండలు, ఎంపీఈఓ ఇంద్రజ, వీఏఏ వెంకటేష్ పాల్గొన్నారు.

పచ్చిరొట్ట వేసుకోవాలి

ఇందుకూరుపేట : వరిసాగు చేస్తున్న రైతులు ముందుగా పచ్చిరొట్ట పంటలైన జీలుగ, జనుము, పిల్లిపెసర వంటి వాటిని వేసుకొని పంట దిగుబడిని పెంచుకోవాలని మండల ఏఓ రఘునాథ్‌రెడ్డి తెలిపారు. మండలంలోని లేబూరు, పున్నూరు గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. వీఏఏలు సుమలత, నరేష్, రైతులు పాల్గొన్నారు.

విత్తన శుద్ధి ముఖ్యం

ముత్తుకూరు : రబీ వరిసాగు చేసే రైతులు విత్తన శుద్ధి పట్ల శ్రద్ధ వహించాలని ఇందుకూరుపేట ఏడీఏ రాజ్ కుమార్ అన్నారు. మండల వ్యవసాయాధికారి జ్యోత్స్నరాణితో కలిసి బుధవారం పిడతాపోలూరులో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. సూడోమొనాస్, వేవిస్టన్, ట్రై సై క్లోజోల్ వంటి మందులతో విత్తన శుద్ధి చేసుకోవాలని సూచించారు. ఇఫ్కో జిల్లా మేనేజర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, నానో ఎరువులను వినియోగించే రైతులు ప్రమాదవశాత్తు మరణిస్తే బీమా సౌకర్యం ఉందన్నారు. తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలని అన్నారు. అనంతరం నారుమడులు పరిశీలించి, నారు యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు.

నారుకొసలు తుంచి నాటు కోవాలి

కొడవలూరు : నారుమడిని తీసి ప్రధాన పొలంలో నాటుకునేటప్పుడు నారు కొసలు తుంచి నాటుకోవాలని జిల్లా వనరుల కేంద్రం ఏఓ ఈ.శైలజ సూచించారు. మండలంలోని కమ్మపాళెం, రాచర్లపాడుల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. నారు కొసలను తుంచి నాటుకోవడం వల్ల గుడ్ల దశలోనే తెగుళ్లు, పురుగులను నివారించుకోవచ్చని తెలిపారు. భూసార పరీక్షల ఆధారంగా ఎరువులను వినియోగించుకోవాలని, తద్వారా సాగు ఖర్చులు గణనీయంగా తగ్గించుకోవచ్చన్నారు. ఏఓ లక్ష్మి, ఏఈఓ పి.వెంకట్రావు, పంచాయతీ కార్యదర్శి మనోహర్, వీఏఏలు ఒ.సుజిత్, డి.నవీన్, వీపీఏలు బి.రామకృష్ణ, రఫీ, ఉప సర్పంచ్ టి.కళాకృష్ణ, స్థానిక నాయకుడు బి.సతీష్ పాల్గొన్నారు.

బుచ్చిరెడ్డిపాళెం : మండలంలోని రామచంద్రాపురం, ఇసుకపాళెం గ్రామాలను మండల ఏఓ ఎం.సురేంధర్‌రెడ్డి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. వీఏఏలు ఎం.మీరయ్య, కె.శ్రీలత, సీహెచ్ సుగుణ పాల్గొన్నారు.



కొడవలూరు : రాచర్లపాడులో పచ్చిరొట్ట సాగును పరిశీలిస్తున్న అధికారులు



పొదలకూరు : రైతులకు విత్తనాలను అందజేస్తున్న ఏఓ



ఇందుకూరుపేట : అధికారుల క్షేత్ర సందర్శన



ముత్తుకూరు : మాట్లాడుతున్న ఏడీఏ రాజ్‌కుమార్